క్లుప్తంగా

గణనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

ఎమ్మెల్సీ తోట



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట, రాజుబాబు తదితరులు

మండపేట: గణనాథుని ఆశీస్సులు వ్యాపారులు, ప్రజలు అందరిపై మెండుగా ఉండాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆకాంక్షించారు. స్థానిక మున్సిపల్ మార్కెట్‌లో గణపతినవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో గురువారం భారీ ఎత్తున ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించి వ్యాపారులను అభినందించారు. నాలుగువేలకు పైగా ప్రజలు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, వర్తక సంఘం నాయకులు చింతలపూడి సత్తిబాబు, లంకలపల్లి శ్రీనివాస్ చౌదరి, తణుకు అశోక్, గోకర కొండ ప్రసాద్, పూసల సత్తిబాబు, కొప్పిరెడ్డి శ్రీను, సత్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో ప్రతిభ



ప్రవల్లికకు ప్రశంసా పత్రం అందిస్తున్న హెచ్‌ఎం రాజు

కె.గంగవరం: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఐ.పోలవరంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో దంగేరు ఉన్నత పాఠశాల విద్యార్థిని పీవీ ప్రవల్లిక స్థానం సాధించింది. ఈ సందర్భంగా వచ్చిన ప్రశంసా పత్రాన్ని ఆమెకు హెచ్‌ఎం రాజు గురువారం అందజేశారు. ప్రతిభ చూపిన ప్రవల్లికను సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి లక్ష్మణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష పరీక్షలు



వల్లూరులో మహిళను పరీక్షిస్తున్న అచ్యుతాపురం వైద్య ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి మండలంలో ప్రారంభం కానున్న వైద్య శిబిరాల్లో ఆరోగ్య సమస్యలున్నవారికి చికిత్సనందిస్తారు. అందులో భాగంగా ఆరోగ్య సమస్యలున్నవారిని గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేస్తున్నారు. అవసరమైన వారికి వైద్య శిబిరంలో మెరుగైన పరీక్షలు చేస్తారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ పథకంలో ఉచితంగా వైద్యసేవలందించనున్నారు.

స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి లోటు

మండపేట: ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి, రైతులకు తీరనిలోటని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. ఆయన మృతిపై ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. జీవితాంతం వ్యవసాయ రంగంలో రైతులకు మేలు చేసే ఎన్నో రకాల పరిశోధనలు చేసిన గొప్ప వ్యక్తి స్వామినాథన్ అని గురువారం ఒక ప్రకటనలో కామన కొనియాడారు.

బీసీలకు ప్రాధాన్యతనివ్వడంపై హర్షం

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో బీసీలకు అత్యంత ప్రాధాన్యతనివ్వడంపై కపిలేశ్వరపురం మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి వాసు హర్షం వ్యక్తం చేశారు. కులగణన అంశానికి అసెంబ్లీ సమావేశాల్లో అత్యధిక ప్రాధాన్యతనివ్వడం వెనుకబడి తన తరగతులవారికి వరమని వాసు అన్నారు.

బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలి

కాజులూరు: మండలంలోని 70 పోలింగ్ బూత్‌ల పరిధిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు ఆధ్వర్యాన నాయకులు గురువారం ప్రావాస్ యోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథగిరిలో ఎంపీటీసీ సభ్యురాలు కొప్పన లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల నాటికి బీజేపీని సంస్థాగతంగా అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజీ, సహాయ కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వద్రే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



మండపేటలో గణేష్ నిమజ్జన కోలాహలం

మండపేట: గణేశ్ నిమజ్జన వేడుకలు గురువారం మండపేటలో ఘనంగా జరిగాయి. స్థానిక బస్టాండు వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు అయినవిల్లి రాజేష్, చిన్నారి సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథున్ని తీన్‌మార్ వాయిద్యాలతో భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లి పెద్దకాలువలో నిమజ్జనం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు అంజిబాబు, సాధనాల శివభగవాన్, ప్రసాద్, జీఆర్సీ మోహన్, పిల్లా విజయ్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని తర్వాణీపేట, బ్యాంకు కాలనీ, పాటిమీద, రావులపేట తదితర ప్రాంతాల్లో గల మండపాల నుంచి వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి కాలువలో నిమజ్జనం చేశారు. కాలువల వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ క. అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కొనసాగుతున్న నిమజ్జనాలు

కాజులూరు: పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు రెండో రోజు కూడా సంబరంగా సాగాయి. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీన గణేశ నవరాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. రోజుల పాటు ఉదయం, సాయంత్రం విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు.. దశల వారీగా నిమజ్జనాలు నిర్వహిస్తున్నారు. కాజులూరు మండలంలోని కొన్ని గ్రామాల్లో గణేశుని విగ్రహాలను బుధవారమే గంగమ్మ ఒడికి చేర్చగా.. కాజులూరు, చేదువాడ, గొల్లపాలెం, కుయ్యేరు, కోలంక, ఆర్యావటం తదితర గ్రామాల్లో గురువారం నిమజ్జనాలు చేపట్టారు. గ్రామ వీధుల్లో గారడీ, కోలాటం, కోయ సంబరాల కోలాహలం నడుమ స్వామివారిని ఊరేగించి.. తుల్యభాగ, ఆత్రేయ గోదావరితో పాటు ప్రధాన కాలువల్లో నిమజ్జనం చేశారు. వివిధ గ్రామాల్లో భారీ స్థాయిలో అన్న సమారాధనలు నిర్వహించారు.

కె.గంగవరం: మండలం కోటిపల్లి వద్ద గౌతమీ గోదావరిలో గణేశ నిమజ్జనాలు కొనసాగాయి. మండలంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి గణనాథులను ఇక్కడకు తీసుకువచ్చి, నిమజ్జనం చేసేందుకు భక్తులు పోటీ పడ్డారు. కోటిపల్లి గ్రామం ప్రారంభం నుంచి రేవు వరకూ బ్యాండు మేళాలు, నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ, భారీ ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం చివరి పూజ నిర్వహించి, నిమజ్జనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎటువంటి అపశ్రుతీ చోటు చేసుకోకుండా ఎస్సై షేక్ జానీబాషా బందోబస్తు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ 70 విగ్రహాలను నిమజ్జనం చేశారని ఎస్సై చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు పుష్కర ఘాట్లను శుభ్రపరచి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకున్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో నెలకొల్పిన గణనాథుని విగ్రహాలను భక్తులు ఘనంగా నిమజ్జనం చేశారు. స్వామివారి విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోలు, లారీలపై ఉంచి, భారీ డీజేలతో ఊరేగింపుగా తోడ్కొని వెళ్లి, కోటిపల్లి రేవు, వెంకటాయపాలెం కాలువల్లో నిమజ్జనం చేశారు.



గొల్లపాలెంలో గణనాథుడి ఊరేగింపు



కోటిపల్లి వద్ద గౌతమీ గోదావరిలో నిమజ్జనం చేసేందుకు వినాయ విగ్రహాన్ని మోసుకెళ్తున్న భక్తులు



ద్రాక్షారామలో నిమజ్జనానికి తరలిస్తున్న గణపతి విగ్రహం

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ స్వీకారానికి మంత్రికి ఆహ్వానం



మంత్రి వేణును ఆహ్వానిస్తున్న పండు గోవిందరాజు, ఎస్సీ నాయకులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 30న జరగనున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను నియోజకవర్గ ఎస్సీ సామాజిక వర్గ నేతలు ఆహ్వానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పండు గోవిందరాజును రెండోసారి ఎంపిక చేసిన నేపథ్యంలో రామచంద్రపురంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని వారు గురువారం కలిశారు. ఇన్నాళ్లూ నియోజకవర్గంలో ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిన తమ సామాజికవర్గానికి.. ఎమ్మెల్యే తరువాత అంతటి ప్రాధాన్యం ఉన్న మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కేటాయించడంపై మంత్రి వేణుకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో చైర్మన్ పండు గోవిందరాజు, వైస్ చైర్మన్ కాకతీయ రాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని, హితకారిణి సమాజం డైరెక్టర్ దొమ్మలపాటి సత్యనారాయణ, మూడు మండలాల ఎస్సీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అండగా నిలవండి

- ఎమ్మెల్సీ తోట
- గొల్లపుంత కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: నిరంతరం ప్రజల కోసమే శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గొల్లపుంతలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన పార్టీ రాష్ట్రనేతలు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులతో కలిసి గురువారం స్థానిక 20వ వార్డు గొల్లపుంత కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి అవసరాలు తెలుసుకుంటూ నాలుగేళ్ల పాలనలో అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం

కాలనీకి విచ్చేసిన ఎమ్మెల్సీ తోటకు చైర్‌పర్సన్ దుర్గారాణి, రమణ దంపతులు, పార్టీ నేత కొమ్ము రాంబాబు ఆధ్వర్యంలో తీన్‌మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో పార్టీ శ్రేణులు, కాలనీవాసులు పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. తమ అభిమానాన్ని చాటుతూ మంగళ హారతులిచ్చారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడదూరంలో ఉండే కాలనీని చైర్‌పర్సన్ దుర్గారాణి ఆధ్వర్యంలో అభివృద్ధి పదంలో నడిపిస్తున్నామన్నారు. 25 సీసీ రోడ్లు నిర్మించామని, త్వరలో మిగిలిన వాటిని పూర్తిచేస్తామన్నారు. తొలుత రూ.88 లక్షలతో కాలనీలో నిర్మించిన పలు సీసీ రోడ్లను ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, నౌడు వెంకటరమణ, మేడిశెట్టి సత్యవేణి, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, మండపేట శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అలీఖాన్‌బాబా, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, పార్టీ నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

రామచంద్రపురం రూరల్: మహా ప్రవక్త హజరత్ మహమ్మద్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్రాక్షారామలో ముస్లింలు గురువారం ఈద్ మిలాదున్నబి ఘనంగా నిర్వహించుకున్నారు. మార్కెట్ జామియా మసీదు కమిటీ ఆధ్వర్యాన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జెండాలు చేతబూని గ్రామంలోని ప్రధాన వీధుల్లో యువత ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మ విశేషాలను మత గురువులు మీర్జా అస్కరి హుస్సేన్, మహమ్మద్ తసదుఖ్ హుస్సేన్‌లు భక్తులకు వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి జాఫర్ హుస్సేన్, రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, జామియా మసీదు కమిటీ పెద్దలు ఖాజా మొహిద్దీన్, ఎండీ యాకుబ్ సాహెబ్, ఎస్‌కే వలీ, ఎండీ గౌస్ మొహిద్దీన్, ఎస్‌కే జిలానీ, ఎస్‌కే ఛాను, ఎస్‌కే బషీర్, వెలంపాలెం షాబాజియా మసీదు అధ్యక్షుడు సయ్యద్ ఫాజిల్ అజారుద్దీన్, ఎస్‌కే వలీ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జామియా మసీదు ఆవరణలో ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.

తోటి మానవుల్ని, సమాజాన్ని ప్రేమించడం ఇస్లాం తత్వం

కపిలేశ్వరపురం: తోటి మానవుల్ని, సమాజాన్ని ప్రేమించడం ఇస్లాం తత్వమని మిలాద్ మహమ్మద్ ప్రవక్త జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అంగరలోని మస్జిద్ ఎ ఇబ్రహీమలో గురువారం ముతవల్లి మహ్మద్ అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. ఇమామ్ మహ్మద్ నాజిం అక్తర్ మాట్లాడుతూ హజ్రత్ ఆదం మొదలు, మహ్మద్ ప్రవక్త వరకూ అనేక మంది సందేశదారులు భూమండలంపై జన్మించిన తీరును వివరించారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.



ద్రాక్షారామ ప్రధాన రహదారిలో బైక్ ర్యాలీ చేస్తున్న ముస్లింలు



అంగర మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఈ-కేవైసీ నమోదు పరిశీలన



వెదురుపాకలో ఈ-కేవైసీ స్టేటస్‌ను పరిశీలస్తున్న ఏవో ప్రభాకర్

రాయవరం: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు, రైతుల ఈ-కేవైసీ నమోదును మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ గురువారం పరిశీలించారు. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ-కేవైసీ చేయించుకోవడానికి ఈ నెల 30తో గడువు ముగుస్తుందన్నారు. ఇప్పటి వరకు ఈ-కేవైసీ చేయించుకోని రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి, వెంటనే చేయించుకోవాలని, ఆధార్ అనుసంధానమైన ఫోన్‌ను తీసుకుని రైతు భరోసా కేంద్రానికి రావలన్నారు. మండలంలో 93 శాతం పంట నమోదు, 74శాతం ఈ-కేవైసీ పూర్తయినట్టు ఆయన తెలిపారు.

ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

అనపర్తి: ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. అనపర్తి మార్కెట్ ఏరియాలో పంచాయతీ ఆధ్వర్యాన రూ.58 లక్షలతో నిర్మించిన 4 దుకాణ సముదాయాల ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఇందులో భాగంగా జ్యోతిరావ్ పూలే పేరుతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎంపీ భరత్‌రామ్ ప్రారంభించి మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఆయనను వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా గెలిపిద్దామని పిలుపునిచ్చారు. బాబూ జగ్జీవన్‌రామ్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ షాపింగ్ కాంప్లెక్స్‌ను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధే అజెండాగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పల్లెల ప్రగతికి బాటలు వేస్తోందన్నారు. దేశ నాయకుల పేర్లపై దుకాణ సముదాయాలు నిర్మించి, ఆ మహనీయులను స్మరించుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎంపీ, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్లు అభినందించారు. మార్కెట్‌లో శ్రీనివాస ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర లైవ్ ఫిష్ దుకాణాన్ని, విద్యుత్ శాఖ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్, రైల్వే అండర్ పాస్ వంతెన నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ గ్రామస్తులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచ్ వారా కుమారి వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక చర్యలతోనే మూషిక సంహారం

- రైతులకు ఉచితంగా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ
- వినియోగంపై వ్యవసాయశాఖ సూచనలు



శీల ఆర్‌బీకే వద్ద వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన ఎలుకల మందు ఎరను తయారు చేస్తున్న రైతులు



గొల్లపాలెంలో ఎలుకల దాడికి గురైన వరి పొలం

కాజులూరు: పంటలపై ఎలుకల దాడి రోజురోజుకూ అధికమవుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎలుకలు పొలాల్లో విజృంభిస్తూ వరి దుబ్బులను మొదలుకు కొరికి పారేస్తున్నాయి. చీడ పీడలను నివారిస్తూ ఎరువులు వేసి, ఏపుగా పెంచిన వరి పంట ఎలుకల దాడికి నాశనమవుతూంటే రైతులు లబోదిబోమంటున్నారు. వాటి నివారణకు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం నామమాత్రంగానే ఉంటోంది. బుట్టలు పెట్టి పట్టినా.. బొరియల్లో పొగ పెట్టి ఊదర పెట్టినా.. మందులు ఎన్ని వాడినా ఎలుకల ఉధృతి తగ్గడం లేదు. ఎలుకల నిర్మూలనకు అధికంగా ఖర్చు అవడమే కాకుండా, వాటి దాడికి గురైన పొలంలో దిగుబడి ఎకరానికి 10 బస్తాల వరకూ తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. అయితే వీటి నివారణకు విడివిడిగా కాకుండా రైతులందరూ సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖాధికారి వి.అశోక్ సూచిస్తున్నారు. సాధారణంగా రైతులు తమ పొలాల్లో మందులు పెట్టి, ఎలుకలను నిర్మూలించినా పక్క పొలాల నుంచి ఎలుకలు వచ్చి, తమ సంతతిని వృద్ధి చేసుకుంటూ పంటలపై దాడి చేస్తూంటాయి. ఒక ప్రాంతంలోని రైతులందరూ ఒకేసారి ఒక పద్ధతి ప్రకారం నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి. ఇదే లక్ష్యంతో వ్యవసాయాధికారులు రెండు రోజులుగా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎలుకల నిర్మూలన మందు బ్రోమోడయోలిన్ పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రామచంద్రపురం నియోజకవర్గ వ్యాప్తంగా 54 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ఎలుకల నిర్మూలన కోసం కాజులూరు మండలానికి 84 కేజీలు, రామచంద్రపురం 80 కేజీలు, కె.గంగవరం మండలానికి 79 కేజీల చొప్పున బ్రోమోడయోలిన్ మందు రాగా, దీనిని వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఈ మందు ఉపయోగించే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఎర తయారీ.. వాడే విధానం

సృష్టిలోని సమస్త జీవరాశుల్లో మనిషి, తిమింగలం తరువాత తెలివైన జీవి ఎలుక. ఓ ఎలుక మందు తిని, చనిపోయే పరిస్థితి వస్తే తక్షణమే ఆ సంకేతాలను ఇతర ఎలుకలకు అందిస్తుంది. దీనివలన అవి ఆ మందు జోలికి వెళ్లవు. వ్యవసాయ శాఖ సరఫరా చేస్తున్న బ్రోమోడయోలిన్ మందు స్లో పాయిజన్‌లా పని చేసి, రక్తనాళాలు దెబ్బ తిని మూడు నాలుగు రోజుల తరువాత ఎలుక చనిపోతుంది. మందు పెట్టిన తరువాత ఒకటి రెండు రోజుల్లో దాదాపు పొలంలోని ఎలుకలన్నీ దీనిని తింటాయి. హెక్టారు పొలానికి తయారు చేసిన మందు (ఎర) అర కేజీ అవసరమవుతుంది. 480 గ్రాములు బియ్యపు నూకలు, 10 గ్రాముల నూనె, 10 గ్రాముల బ్రోమోడయోలిన్ మందు కలిపి, మందు ఎర తయారు చేసుకోవాలి. ముందుగా నూకలను పేపరుపై వేసి, నూనె పోసి కలపాలి. ఆపై బ్రోమోడయోలిన్ మందు వేసి, నూనె కలిపిన నూకలకు పట్టించాలి. ఈ మందును మూడంగుళాల వ్యాసం, 18 అంగుళాల పొడవు కలిగిన పీవీసీ పైపుల్లో 30 గ్రాముల చొప్పున వేసి పొలానికి నాలుగు మూలలా గట్లపై అమర్చుకోవాలి. వారానికి రెండుసార్లు తాజాగా తయారు చేసిన ఎరను ఉంచాలి. పీవీసీ పైపులు వాడటం వలన విషపు ఎర ఎండ, వానలకు పాడవకుండా ఉంటుంది. అంతే కాకుండా పక్షులు, పెంపుడు జంతువులకు అందకుండా మెరుగైన ఫలితాలు వస్తాయి.

– వి.అశోక్, మండల వ్యవసాయాధికారి, కాజులూరు

గడువు ముంచుకొస్తోంది..

- క్లస్టర్ పరిధిలో 59 శాతం ఈ-క్రాప్ నమోదు
- సర్కారు పథకాలు పొందేందుకు తప్పనిసరి
- 30 వరకూ గడువు పొడిగించిన ప్రభుత్వం



క్షేత్ర స్థాయిలో పంటల నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సహాయకులు

రాయవరం: ఆరుగాలం శ్రమించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. మాటలతో కాలం వెళ్లబుచ్చకుండా రైతుల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తోంది. విత్తనం విత్తు దగ్గర నుంచి పంట చేతికి అంది వచ్చి, విక్రయాలు సాగించే వరకూ రైతుల పక్షాన నిలుస్తూ అండగా ఉంటోంది. రైతు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల వర్తింపు, రాయితీలు, ప్రకృతి వైపరీత్యాలతో పంట దెబ్బ తింటే నష్టపరిహారం పొందడానికి, మార్కెట్‌లో మద్దతు ధర దక్కకపోతే రైతులను ఆదుకునేందుకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా మారింది. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులను పంట పొలంలో నిలబెట్టి ఫొటో తీసి, వాటిని అప్‌లోడ్ చేసే ప్రక్రియ చేపడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఈ పంట నమోదు ప్రక్రియ ఈ నెల 15తో గడువు ముగిసినప్పటికీ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం నెలాఖరు వరకు పొడిగించింది.

రెండు నియోజకవర్గాల పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల పరిధిలో 85,543 ఎకరాల్లో 50,273 మంది రైతులు ఖరీఫ్ వరిసాగు చేస్తున్నారు.

వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు క్లస్టర్ పరిధిలో 75,664 ఎకరాల్లో 59 శాతం మేర ఈ-పంట నమోదు చేశారు. రైతుల బయోమెట్రిక్‌ను తీసుకున్న తర్వాత మాత్రమే పంట నమోదు ప్రక్రియ పూర్తయినట్లుగా భావించాలి. ఇప్పటి వరకు 22,166 మంది రైతులు 40,801 ఎకరాలకు ఈ-కేవైసీ పూర్తి చేయించుకున్నారు. ఈ-క్రాప్ బుకింగ్‌కు ఇక రెండు రోజులు మాత్రమే గడువు ఉంది.

ప్రత్యేకంగా డిజైన్ చేసిన యాప్‌లో..

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట నమోదుకు నూతన విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానంలో మండల వ్యవసాయాధికారులు సర్వే నంబర్లను వెబ్‌ల్యాండ్ నుంచి డౌన్‌లోడ్ చేసి, గ్రామ స్థాయిలో వ్యవసాయ సహాయకులకు సర్వే నంబర్లను కేటాయిస్తారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సర్వే నంబర్లను ఈ-కర్షక్ వెబ్‌లాగిన్‌లో అప్‌డేట్ చేసుకుంటారు. అనంతరం ఈ-కర్షక్ మొబైల్ యాప్‌లో జియోఫెన్సింగ్ డౌన్‌లోడ్ చేసుకుని పంట నమోదు ప్రక్రియను ప్రారంభిస్తారు. ఒక సర్వే నంబర్‌కు వెళ్లినప్పుడు ఆ సర్వే నంబర్ జియో కోఆర్డినేట్స్ ఓపెన్ అవుతాయి. సర్వే నిమిత్తం వ్యవసాయ సహాయకులు క్షేత్ర స్థాయి సర్వే నంబర్‌కు వెళ్తేనే యాప్ ఓపెన్ అవుతుంది.

గ్రామ వ్యవసాయ సహాయకులకు ఈ-కర్షక్ యాప్ జియోఫెన్సింగ్‌తో అనుసంధానం అయి ఉంటుంది. ఇప్పటి వరకు ఉపయోగించే ట్యాబ్‌లో అటెండెన్స్‌తోపాటు రోజువారీ విధుల వివరాలు, రైతు బీమా, రైతు బంధు అప్‌డేట్ నమోదు చేసేవారు. ఇందులోనే ఈ-క్రాప్ బుకింగ్ చేసేవారు. అయితే క్షేత్రస్థాయి వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే పంటల వివరాలు నమోదు చేసేలా ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం నూతనంగా మార్పులు చేసింది. సర్వే నంబర్‌కు వెళ్లినప్పుడు మాత్రమే వివరాలు కన్పించేలా మాడ్యూల్‌ను రూపొందించింది. సర్వేకు వెళ్లినప్పుడు గూగుల్‌లో జియోఫెన్స్ ద్వారా ఆ లొకేషన్‌కు చేరుకుంటారు. 200 మీటర్ల దూరంలో ఉన్నప్పుడు మాత్రమే సర్వే నంబరు వివరాలు యాప్‌లో కన్పిస్తాయి. అప్పుడే నమోదు చేయాలి.

93 శాతం పూర్తి



మండలంలో ఇప్పటి వరకు 93 శాతం మేర ఈ-పంట నమోదు చేశాం. ఇప్పటి వరకు నమోదు చేసుకోని రైతులు త్వరపడాలి. ఈ-పంట నమోదుతోనే రైతులకు ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలకు అర్హులవుతారు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం